భర్తను అతిగా ప్రేమించిన ఆమె మనసులో రేగిన కల్లోలం సద్దుమణిగిందా?

# కలవరమాయె మదిలో

సీతా సత్య

కథ

సిద్ధార్థ నా ప్రేమికుడు: నేనతడి ప్రేయసివి. ఎప్పటికీ మేం ప్రేమికులమే! ఈ విషయం నాకు బాగా అర్థం కావడానికి పన్నెండేళ్లు... అవును పన్నెండేళ్లు పట్టింది. తొలి చూపులోనే ప్రేమలోపడి, మలి చూపులోనే పరస్పర విశ్వాసం ఏర్పడి, ఎంతో దగ్గరయ్యే ప్రేమికుల ప్రేమతో పోల్చదగినంత గొప్పది కాదు మా ప్రేమ. బహుశః అందువల్లనే కాబోలు, పుష్కర కాలం పట్టింది నాకు. మేం ఇరువురం ప్రేమికులమనే విషయం తెల్సుకుందుకు.

సిద్ధార్థతో నా తొలి పరిచయం పెళ్లి పీటల మీదే జరిగింది. పన్నెండేళ్ల క్రితం. పెళ్లిచూపులేర్పాటు చేసి మా వాళ్లు కబురు చేసినపుడు అతడి అక్కా, బావా వచ్చారేగానీ అతడు రాలేదు.

'పెళ్లయాక ఎలానూ నిత్యమూ ఇంట్లో చూస్తూనే ఉంటాగా. మీరెళ్లి చూసిరండి. మీ కంత సరదాగా ఉంటే' అన్నాడంట అక్కా, బావలతో పెళ్లయ్యాక మా ఆడపడుచు అమ్మతో అంటోండగా నా చెవిన పడ్డాయా మాటలు.

పెళ్లికి ముందు అతడి ఫోటో కూడా చూడలేదు నేను. పెళ్లి చూపుల తంతు ముగిశాక నేను వాళ్లకు నచ్చానని అక్కడికక్కడే చెప్పి, నా ఫోటో అడిగి తీసుకుంది మా ఆడపడుచు. ఇంటికెళ్లాక, నా ఫోటో చూపించి 'అమ్మాయి మాకు బాగా నచ్చింది. నీక్కూడా నచ్చితే ముహూర్తాలు పెట్టించమని కబురు చేద్దాం' అని మా ఆడపడుచు అంటే 'అలాగేలే' అని నవ్వుతూ బయటకు వెళ్లిపోయాడేగానీ, అక్కగారు కళ్ల



ముందుంచిన ఫోటోనుచూసే ప్రయత్నమెంత మాత్రముచేయనేలేదట ఆ మానవుడు.

పెళ్లికి ముందు ఈ వివరాలు ఆ నోటా ఈనోటా విన్నఅమ్మ కొంచెం ఆందోళన చెందిన మాట వాస్తవమే! కానీ సిద్ధార్థ వంశపు పుట్టు పూర్వోత్తరాలు, అతడి ఇతర గుణగణాలూ అన్నీ పాజిటివ్‌గానే ఉండటం తో ఆ విషయాన్నిమరచిపోయి చురుకుగా

పెళ్లి పనుల్లో మునిగిపోయింది అమ్మ.

నా అభిప్రాయం పట్టించుకోవాలనే ఆలోచన ఎవరికీ రాలేదు. నా మనసులోని భావాలను పంచుకుందుకు కూడా ఎవరూ దొరకలేదు నాకప్పట్లో. ఒకరిద్దరు దగ్గర బంధువులు, 'నీక్కాబోయే మొగుడందంగా ఉంటాట్ట కదే!' అన్నపుడు 'ఆహా!' అనుకున్నాను.

పెళ్ళి జరుగుతున్నపుడు అతడి పక్కన కూర్చున్న కొద్ది గంటల్లోనూ, కొన్నిసార్లు ఓరగానూ, మరికొన్నిసార్లు ఎదురుగానూ వివిధ భంగిమల్లో చూడగలిగానతణ్ణి. మొత్తానికి పెళ్ళి పూర్తయేలోగా అతడి ఒడ్డూ, పొడుగూ, రంగూ, అందమూ ఇత్యాదుల మీద ఓ అవగాహన వచ్చేసింది నాకు. ఆ తరువాత ఓ వారం రోజుల్లో అతడి అలవాట్లూ, ఇష్టానిష్టాలూ, వగైరాల గురించి చూచాయిగా తెలిసిపోయింది నాకు.

కాపురం పెట్టిన వెలరోజుల్లోనూ అతడి సద్గుణాలు, చిలిపితనమూ, హాస్యప్రియత్వమూ బాగా తెలిసొచ్చాయి నాకు. కూర ఎంత ఛండాలంగా వండినా మెచ్చుకునేవాడు. సినిమాకో, షికారుకో బయలుదేరినపుడు నేను గంటల తరబడి ముస్తాబుచేసుకున్నా విసుక్కునేవాడు కాదు. దార్లో కనిపించిన ఆడవాళ్లను చూసి ఏనాడూ వ్యాఖ్యానం చేసుకపోగా, నేను వాళ్లనతడికి చూపించి, "చూశారా ఆ అమ్మాయి ఎంతందంగా ఉందో!' అన్నా కూడా అటువైపు చూడకుండా తిరిగి నన్నే మురిపెంగా చూసేవాడు. సీట్ల నంబర్ల ప్రకారం సినిమా థియేటర్లో ఒకోసారి నా పక్కన పరాయిమగాడు కూర్చోవలసి వచ్చినా ఎంతమాత్రమూ గింజుకు పోయేవాడు కాదు. నేను మొదటిసారి కాన్పుకు పుట్టింటికి వెళ్లినపుడు, భర్తనుంచి విడాకులు తీసుకుని అన్నగారింట్లో కాలం వెళ్లమారుస్తోన్న ఎదురింటి లాయర్ గారి చెల్లెలు ఎన్ని వన్నెచిన్నెలు ప్రదర్శించిందో కళ్లకు కట్టినట్లు చెప్పి పగలబడి నవ్వాడు. ఆఫీసులో టైపిస్టమ్మాయి, ఏదో వంకతో రోజుకెన్నిసార్లు తనను కవ్వించేదో వివరంగా చెప్పేవాడు.

తను చదువుకునే రోజుల్లో ఓ అమ్మాయికి ప్రేమలేఖ అందించిన రోజు, బహుమతిగా వెనువెంటనే ఆమె అందించిన చెంప దెబ్బ గురించి ఏ మాత్రమూ సిగ్గుపడకుండా చెప్పాడు. తనుద్యోగంలో చేరిన కొత్తల్లో తన కూతుర్నిచ్చి చేయడానికి బాస్ ఎన్ని ప్రయత్నాలు చేశాడో వాటిని తానెలా తిప్పి కొట్టాడో సవివరంగా చెప్పాడు.

ఇలా తన గురించి ఏ విషయమూ దాచుకోకుండా తన మనసులో తను మాట్లాడుకున్నంత నిజాయితీగా నాతో వ్యవహరించిన సిద్ధార్థ మీద ప్రేమ నాకు తెలియకుండానే పుట్టుకొచ్చి, నా ప్రమేయంలేకుండానే పెరిగి పెద్దదై నా మనసులో స్థిరపడిపోయింది.

సిద్ధార్థ నెవరేమన్నా సహించలేని స్థితికి అచిరకాలంలోనే వచ్చేశాను నేను. మా అమ్మా, నాన్నలు కానీ, మా ఆడపడుచుగానీ, ఒక్కమాట హాస్యానికైనా సరే సిద్ధార్థనుద్దేశించి అంటే ఊరుకునే దాన్ని కాను.

'నా మీద నీకెందుకు విజయా, ఇంత ప్రేమ?', అనేవాడు సిద్ధార్థ. అతనిగురించి


ఇతరుల్తో నేను దెబ్బ లాడిన సందర్భాల్లో. ఏం చెప్పను నేను? నిరంతరమూ నా తలపుల్లోనే కాపురముండే సిద్ధార్థను ఎందుకు ప్రేమిస్తున్నానో అంత సులభంగా ఎలా చెప్పగలను? జాగ్రదావస్థలోనే కాకుండా నిద్రలో కూడా అతడి ఆలోచనలే నన్ను వెన్నాడుతూంటాయని అతడికి మాత్రం తెలియదూ?

అతడే నేనుగా, నేనే అతడుగా ఇలా పన్నెండేళ్లు గడిచిపోయాయి. ఓ రోజు ఇంటికి వస్తూ ఒకతన్ని తీసుకువచ్చాడు సిద్ధార్థ. సిద్ధార్థ కంటే పొడుగ్గా, బలంగా ఉన్నాడతను. వయసులో సిద్ధార్థకంటే చిన్న వాడే వనిపించింది. వాకతణ్ణి చూడగావే. కానీ తరువాత మాటల్లో తెలిసింది, వాళ్లిద్దరూ సమ వయస్కులేననీ, కలిసి చాలాకాలం పక్కపక్క ఇళ్లలో పెరిగి, ఒకే కాలేజీలో చదువుకున్నారని.

ఆ విషయం తెలిశాక తేరిపార చూశానతణ్ణి. అతడు వేసుకున్న దుస్తులో, తలకట్టో, అతడి శరీర ఆకృతో లేదా వీటన్నిటి సమైక్యం వల్లనోగానీ, మళ్లీ నా కళ్లకతడు చిన్నవాడిలానే కవిపించాడు. అతడికింకా పెళ్లి కాలేదనీ, అందుక్కారణం అతడికి నచ్చిన అమ్మాయి కనబడకపోవడమేననీ అన్నాడు సిద్ధార్థ. నా కెందుకో ఆ కారణం నమ్మదగ్గదిగా అనిపించలేదు. ఆ రోజు సరిగ్గా నాలుగు గంటలసేపున్నాడతడు మా ఇంట్లో. సాయంత్రం ఆరు గంటలకొచ్చిన శశాంక భోంచేసి రాత్రి పది గంటలకు వెళ్లిపోయాడు.

చిన్ననాటి మిత్రులిద్దరూ కలిసి చాలాకాలమైందేమో వారి కబుర్లెంత సేపు చెప్పుకున్నా ఒహపట్టాన తరగలేదు. ఆ నాలుగ్గంటల కాలంలోనూ అతడి చురుకైన కళ్లు నా మీద చాలాసార్లు తారట్లాడాయి. మగవాడి చూపులకర్థం తెలుసుకోలేని ముగ్ధను కానుకదా!

ఆదే విషయం రాత్రి పడుకోబోయే ముందు సిద్ధార్థతో చెప్పాను. తేలిగ్గా నవ్వి



కొట్టి పారవేశాడు సిద్దార్థ. 'నీదంతా ఉత్త అమమానం' అంటూ. అంతేకాకుండా 'వ యం... ఈ మాట పొరపాట్న ఎప్పుడైనా శశాంకతో అనేవు' అని కూడా అవి న్ద్రకుప్రకమించాడు సిద్దార్థ.

నాకెందుకో శశాంక రాక అంత శుభ సూచకంగా అనిపించలేదు. రాత్రంతా అదే విషయం ఆలోచిస్తూ కలత నిద్రపోయాను. మర్నాడు సాయంత్రం రోజూలానే సిద్దార్థ కోసం ఎదురు చూస్తూ డ్రాయింగ్‌రూమ్ లో కూర్చుని ఉండగా కాలింగ్ బెల్ మోత వినిపించింది. సిద్దార్థకు కాలింగ్ బెల్‌తో పనేముంది?

లేచి నిలబడి తలుపు దగ్గరకు వెళ్లేలోగా అది మెల్లగా తెరచుకుంది. ఆ వెనుకే నవ్వుతూ శశాంక ప్రవేశించాడు. ఎందుకో గానీ అప్రయత్నంగా తడబడ్డాను నేను.

"అరే. అదేవిటీ అలా ఉన్నారూ? ఈ సమయంలో సిద్దార్థకు బదులు నేనొచ్చానేవి టా అనా? మీ చేతి మహాత్మ్యం మరి! అంతద్భుతంగా వండి పెట్టారు. రాక ఛస్తానా?" అంటూ తను కూర్చోవడమే కాకుండా నన్నుకూడా, "కూర్చోండి కూ ర్చోండి" అంటూ మర్యాద చేశాడు. నేనెక్కడ అతడి నొదిలి లోపలి గదుల్లోకి వెళ్లిపోతానో అనుకున్నాడు కాబోలు.

నా వయసిరవై తొమ్మిది. అతడి వయసు ముప్పైరెండో, ముప్పై మూడో ఉండొచ్చు. పెళ్లయి పన్నెండేళ్ల కాపురం చేసిన దాన్ని నేను. అతడింకా పెళ్లికాని ముదురు బ్రహ్మ చారి. ఎందుకో తెలియదుకానీ నాకా పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంది. సిద్దార్థ త్వరగా వచ్చేస్తే బావుణ్ణనిపించింది. క్షణాలు నిముషా ల్లా, నిముషాలు గంటల్లా గడుస్తున్నాయి.

"నాతో మాట్లాడకూడదని ఏమైనా ఒట్టుపెట్టుకున్నారా విజయగారూ!" అన్నా డతడు, వేల చూపులు చూస్తోన్న నన్ను మాట్లాడించే ప్రయత్నం చేస్తూ.

అవును, అతన్ని చూసి నేనెందుకు తడబడిపోవాలి? సిద్దార్థ వచ్చే లోగా అతడికి మర్యాదలుచేసి నాలుగు మాటలు మాట్లాడ్డ ం వలన నేను కోల్పోయేదేవిటి? మొహం మీదకు చిరునవ్వు తెచ్చుకున్నాను నేను.

"కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తాను" అం టూ లోపలికి నడవబోయిన నన్ను వారించి, "కాఫీ, టీల కోసం హడావిడిగా వంటింట్లో కి పరుగెత్తకండి. ఇలా వచ్చి కూర్చుని కబుర్లు చెప్పండి. సిద్దార్థ వచ్చాక మీకు తోచిన మర్యాదలు చేద్దురుగాని" అన్నాడు శశాంక.

అదే, అదే నాకతనిలో నచ్చడం లేదు. ఏం మాట్లాడ్తాడు నాతో? మీ ఇల్లు చాలా నీట్‌గా ఉందంటాడా? మీ చేతివంటలానే మీరెంతో అందంగా ఉన్నారంటాడా? మీకీ చీర అద్భుతంగా ఉందంటాడా? మీ కళ్ళు చాలా బావున్నాయంటాడా? మీరు చాలా చిన్నవారిలా కనిపిస్తున్నాడంటాడా? మీ నడ కెంతో బాగుందంటాడా? మీ లాంటి స్త్రీ నాకు కనిపించి ఉంటే ఈపాటికి నేనెప్పుడో బ్రహ్మచర్యాన్ని వదిలేసి ఉండేవాడినంటాడా ? ముళ్లమీద కూర్చున్నట్టుగా, నెమ్మదిగా, అతడి కెదురుగా సోఫాలో కూర్చుని కళ్లను తెరచిఉంచిన పీధి గుమ్మానికివప్పజెప్పాను.

మనసుల్ని చదవడంలో మంచి అనుభవం ఉన్నవాడిలా అన్నాడు శశాంక. "మీ నోటి ముత్యాలేరుకుందామని ఎంతో ఆశగా నేను మీ వైపు చూస్తూ కూర్చుంటే, మీరేమిటి, కళ్లను వీధిగుమ్మానికి వప్పజెప్పారు? సిద్ధార్థ కోసం కాదుకదా?"

గతుక్కుమన్నాను నేను. నాకెందుకో అతడి ధోరణి చిరాగ్గా ఉంది. మనసుకెంత సమాధానపరచుకుందామన్నా అతడి పద్ధతి ఒహపట్టాన నాకు కొరుకుడు పడడం లేదు. సిద్ధార్థ ఇంటికి రాగానే చెప్పాలి, ఇతడినెప్పుడూ ఇంటికి రానీయవద్దని. నేను చెప్పిందంతా విన్నాక సిద్ధార్థ పట్టించుకోకపోతే?


నీ మనసులో ఉన్న భావన నతడికి అంటగడుతున్నావేమో? అంటే, నా దగ్గర సమాధానం ఏముంది? తన మిత్రుడటువంటివాడు కాదనీ, అతడి గురించి తనకు బాగా తెలుసుననీ వాదిస్తే? సిద్ధార్థ అలా అనే అవకాశం లేకపోలేదు. అయితే శశాంకను వదుల్చుకోవడమెలా?

శశాంకకు మరికాస్త చనువిచ్చి అతడి అసలు నైజాన్ని సిద్ధార్థ తెలుసుకునేలా చేయాలా? అంటే అతడితో చనువుగా ఉండి అతణ్ణి ప్రేరేపించాలా? తీరా అలా చేస్తే తన పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడిన చందం కాదుకదా?

నా మనసులోని ఊహలన్నీ కేవలం నా ఊహలేనేమో? నామీద అతడికెటువంటి దురుద్దేశమూ లేదేమో? తన స్నేహితుడి భార్యగానే తప్ప నన్నతడు మరో దృష్టితో చూడడం లేదేమో? ఈ విషయం తెల్సుకోవడమెలా? ప్రశ్నలు వేసుకుంటూ, నాకు నేనే సమాధానం చెప్పుకుంటూ, నాలో నేనే వితర్కించుకుంటూ చాలా సమయం గడిపేశాను. నా ఆలోచనల్లోంచి తేరుకుని చూసేసరికి శశాంక అక్కడ లేదు.

అతడెప్పుడు వెళ్లిపోయాడో కూడా నాకు తెలీదు. అంత వరకు అతడి ఉనికిని ఎంతో ఇబ్బందికరంగా భావించిన నేను తీరా అతడెళ్లి పోయాక సంతోషించకపోగా ఏదో

## వంతెన



"వంతెన మీదుగా పోవచ్చు గదా" పక్కనుంచి కాకుండా" అంది భార్య.

"ఆ వంతెన నేను కట్టించినదే అందుకే డౌట్!" చెప్పాడు కాంట్రాక్టర్ భర్త.

బి.మల్లికార్జునరావు
(పెద్దాపురం)

దిగులు నా మనసు నావహించింది. మనసం తా ఎంతో అసంతృప్తిగా అనిపించింది. చేయకూడని పనిచేసి అతడి నవమానించిన ట్టుగా అనిపించింది.

ఎంతో సరదాగా వచ్చిన శశాంక నాతో చెప్పకుండా వెళ్లిపోయాడంటే నా ప్రవర్తన కతడెంత చిన్నబుచ్చుకున్నాడో కదా! ఈసారి అతడొచ్చినపుడు మర్యాదగా పలకరించాలి. అరమరికలు లేకుండా మనసు విప్పి ఓ స్నేహితుడితో వ్యవహరించినట్టుగా ప్రవర్తిం చాలి. అతడు సిద్దార్థకు స్నేహితుడైతే నాకు మాత్రం స్నేహితుడు కాదూ?

నాలుగురోజుల తర్వాత ఓ రోజు ఆఫీస్ నుంచి లేట్‌గా వచ్చాడు సిద్దార్థ. నేనడిగేలో గా అతనే అన్నాడు, "ఈ రోజు శశాంక బజార్లో కలిశాడు. కబుర్లు చెప్పుకుంటూం టే కాలం తెలియలేదు. వాకివ్వాళే తెలిసింది . శశాంకకు విన్ను చూస్తే భయమని ఏంచేశావోయ్, వాడంతగా బెదిరిపోయా డూ?"

నా గుండెలు గుబగుబలాడాయి. ఎందు కో తెలియదు గానీ వంట్లో సన్నగా ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. నేనారో జు ఉదాసీనంగా ఉన్న విషయం సిద్దార్థతో చెప్పాడా శశాంక? ఈ విషయం ఆ రోజే నేను సిద్దార్థతో చెప్పి ఉండాల్సింది. ప్రతి చిన్న విషయాన్నీ సిద్దార్థతో పంచుకునే నేను ఆ రోజు శశాంక వచ్చి వెళ్లిన విషయం చెప్పలేదెందుకని?

అతి కష్టం మీద నవ్వు తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ "భలేవారే, మీ ఫ్రెండ్‌ఏమైన నా చిన్నపిల్లాడా న్నుచూసి భయపడ్డానికి? బాగా చూసి చెప్పండి. నేనేమీ జాతరలో అమ్మవారిలా కనిపించడం లేదు కదా?" అన్నాను.

ఫక్కున నవ్వేశాడు సిద్దార్థ. "వాడెందు కు బెదిరిపోయాడో నాకు తెలీదు గానీ, నాకు మాత్రం ఆ రోజు కారోజు నీ అందం పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. నీ సౌంద ర్య రహస్యం ఏమిటో చెప్పి పుణ్యం కట్టుకోవూ?"

"ఇంకేమైనా అన్నారు కాదు. కాకి పెళ్లాం కాకికి ముద్దనే సామెత విన్లేదా మీరూ?" అన్నాను.

"ఆ సామెతెప్పుడూ విన్నట్టు లేదుగానీ, కాకి ముక్కుకు దొండపండనే సామెత మాత్రం ఎప్పుడో విన్నట్టుగా గుర్తొస్తోందో య్!" అన్నాడు సిద్దార్థ బుంగమూతి పెడ్తూ.

నాతో పోలిస్తే సిద్దార్థ ఛాయ తక్కువే. పరిహాసానికే అయినా అలా అన్నందుకు నొచ్చుకున్నాను నేను. నా మొహం కొద్దిగా మ్లానమవడాన్ని సిద్దార్థ కళ్ళు ఇట్టే పసిగట్టే శాయి. నన్ను దగ్గరకు తీసుకుంటూ, "ఇంతలోనే అంతలా బాధపడిపోవాలా? అయినా నువ్వు నన్నేమన్నావనీ?" అన్నాడు మురిపెంగా.

అప్పుడు చెప్పాను నేను. ఆరోజు శశాంక వచ్చి వెళ్లిన సంగతి. అంతా విని కళ్ళు విప్పార్చి నా వైపు చూస్తూ అన్నాడు సిద్దార్థ "అదీ సంగతి! 'మా ఇంటికి రావోయ్' అని ఎన్నిసార్లు పిలిచినా 'బాబ్బాబు నన్నొదిలేయ్' అన్నాడేగానీ కనీసం మాట మాత్రంగానైనా ఈ విషయం నాతో అనలేదే!"

ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతైంది. తప్పుచేసిన దానిలా తలదించుకున్నాను నేను. నా ఇబ్బందిని గమనించినట్టున్నాడు సిద్ధార్థ. తిరిగి తనే మాట్లాడాడు.

"ఇప్పుడంతా అర్థమైంది నాకు. మొదటిరోజు శశాంక మనింటికొచ్చినపుడు నువ్వు తణ్ణి మనింటికి రానీయవద్దని చెప్పినపుడే నీకు మరికొంచెం వివరంగా చెప్పి ఉండాల్సింది నేను. తొలి పరిచయంలోనే అతడి మాటల ధోరణి నీకతిగా అనిపించి ఉంటుంది అవునా?"

మౌనంగా తలూపాను నేను.

"నీకలవరపాటుకు కారణం, నువ్వు నన్నతిగా ప్రేమించడమే తప్ప మరొకటి కాదు. అదే నీ స్థానంలో నాలాంటి మగాడున్నాడనుకో. భార్య తన స్నేహితురాల్ని పరిచయం చేస్తే నీలా అంటీ ముట్టనట్టు స్తబ్దుగా ఎంతమాత్రమూ ఉండడు. సరికదా, సరదాగా సంభాషించే ప్రయత్నం చేస్తాడు, కానీ భార్యకేదో అన్యాయం చేసేస్తున్నానని గింజుకుపోడు. అంత మాత్రాన అతడికి తన భార్యమీద ప్రేమ లేదనే నిర్ధారణకొస్తే అంతకంటే తొందరపాటు భావన మరొటి ఉండబోదు. మగాడికీ, ఆడదానికీ మౌలికంగా ఉన్న తేడా అదే!

కానీ నీ మనసులో ఎక్కడో నువ్వు నన్ను ప్రేమించినంత నిజాయితీగా నేను నిన్ను ప్రేమించడం లేదేమోననే అపనమ్మకం తలెత్తుతోంది. జరగకూడనిదేదైనా జరిగి, నేను నిన్ను దూరం చేసుకుంటానేమోననే అభద్రతా భావన తాలూకు భయం నిన్ను వెన్నాడుతోంది.

మైడియర్ విజ్జీ... పెళ్లికి ముందు నీ గురించి నాకూ, నా గురించీ నీకు ఏమీ తెలియదు. కానీ ఈ పన్నెండేళ్ల మన వైవాహిక జీవితంలోనూ... నువ్వే నేను, నేనే నువ్వు అన్నంత ఇష్టంగా బతికాం. అటువంటప్పుడు శశాంకో, చారులతో మన జీవితాల్లోకి తొంగి చూసినంత మాత్రాన చెదిరిపోయేంత బలహీనమైందా మన ప్రేమ?" అన్నాడు శశాంక నన్నునురాగంగా చూస్తూ.

చివ్వున తలెత్తి అన్నాను నేను "ఈ చారులతెవరూ?"

ఆగకుండా అరనిముషంపాటు నవ్వి అన్నాడు సిద్ధార్థ "విజయ స్నేహితురాలు"

నాకా పేరుగల స్నేహితురాళ్ళెవరూ లేరు. ఒక్క క్షణం విస్తుపోయి, తరువాత సిద్ధార్థ మొహాన్ని రెండు చేతుల్తోనూ దగ్గరకు తీసుకుని అతడి నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాను. 'ఐ లవ్ యూ సిద్దూ' అంటూ నాపెదాలు అస్పష్టంగాగొణిగాయి.

*